సమస్యలు పరిష్కరించాలి..

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

అబిడ్స్, ఫిబ్రవరి 6 : గోషామహల్ నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలని నియోజకవర్గం బీఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం పార్టీ నేతలతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి పెండింగ్ పనులను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో హిందీ మాట్లాడే పేదలు చాలా మంది ఉన్నారని, వారి కోసం ధూల్‌పేటలోని దాస్‌మట్‌లో ప్రభుత్వ భూమి ఉందని, అక్కడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. గోషామహల్‌లో రోడ్లు వెడల్పు చేయాలని మంత్రిని కోరామన్నారు. పుత్లిబౌలి నుంచి అఫ్జల్‌గంజ్ వరకు, ఎంజే మార్కెట్, ఓల్డ్ పీఎస్ నుంచి భూలక్ష్మి అమ్మవారి ఆలయం వరకు, బోయిగూడ కామన్ నుంచి పురానాపూల్ గాంధీ విగ్రహం వరకు రోడ్డు వెడల్పు చేయాలని మంత్రిని కోరగా.. ఆయా పనులు త్వరలో చేపడుతామని చెప్పినట్లు తెలిపారు.

సమస్యల్లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా..

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కామ్‌గార్‌నగర్ బస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ, ఫిబ్రవరి 6 : స్థానికుల సహకారంతో నియోజకవర్గంలోని డివిజన్ల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గోల్నాక డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి మంగళవారం ఉదయం కామ్‌గార్‌నగర్ బస్తీవాసులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు కొన్ని రోజులుగా లోప్రెషర్ నీటి సమస్య తలెత్తుతుందని, సీసీ రోడ్లు వేయాలని, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ సమస్యలు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక ప్రజల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. బస్తీలో ఉన్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో గండికోట జనార్దన్, సురేశ్‌గౌడ్, కామ్‌గార్‌నగర్ బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కన్నులవిందుగా అర్ధ నారీశ్వర నృత్యం

తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సౌజన్యంతో హిరణ్మయి నృత్యాలయ నిర్వహణలో రవీంద్రభారతిలో నిర్వహించిన అర్ధ నారీశ్వర కూచిపూడి నృత్యప్రదర్శన కన్నులవిందు చేసింది. ఈ కార్యక్రమానికి నృత్య గురువు ప్రియాంకా భర్దే వచ్చేసి జ్యోతిప్రజ్వనలం చేసి తన శిష్య బృందంచే నర్తించి వీక్షకులను సమ్మోహితులను చేశారు. వందమందికిపైగా పాల్గొన్న ఈ నృత్య ప్రదర్శనలో నట్టువాంగం గురువు డాక్టర్ రమాదేవి, వసంత కిరణ పాలుపంచుకోగా శ్వేతప్రసాద్, భాగ్యశ్రీ అద్దంకి గానం చేశారు. – రవీంద్రభారతి, ఫిబ్రవరి 6

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీ విధానం రద్దుకు కృషి

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత మధుయాస్కీగౌడ్

రవీంద్రభారతి, ఫిబ్రవరి 6 : తెలంగాణ వ్యాప్తంగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి టైం పేస్కేల్ ఇచ్చే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి ఏజెన్సీ విధానం రద్దుకు కృషి చేస్తానని కాంగ్రెస్ నేత మధుయాస్కీగౌడ్ అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి టైం పేస్కేల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ బొల్లం, ట్రెజరీ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మధుయాస్కీ గౌడ్ విచ్చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కరానికి కృషిచేస్తానని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు ప్రకృతే జీవనం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 6 : మానవ మనుగడకు ప్రకృతే జీవనమని ప్రజా కవి డాక్టర్ జయరాజ్ అన్నారు. హైదరాబాద్ జిందాబాద్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాఠశాలల విద్యార్థులకు ప్లాస్టిక్ కాలుష్యాన్ని తరిమికొట్టండి అనే అంశంపై జోన్ స్థాయి పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జయరాజ్ , సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, వీరయ్య,శివనారాయణ, రాజీవ్‌పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సమావేశానికి తరలిన నేతలు..

మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ సమావేశానికి ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆనంద్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో పార్టీ నేతలు భారీగా తరలివెళ్లారు. బీఆర్ఎస్ నాయకులు సంజయ్, చెన్నబత్ని లక్ష్మీనారాయణ, జకీఉల్లాఖాన్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.
– మెహిదీపట్నం ఫిబ్రవరి 6

తెలంగాణ భవన్‌లో మంగళవారం బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన సమావేశానికి బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. పార్టీ నాయకులు రాకేశ్‌కుమార్, నితన్, పున్నవల్లాల శ్రీనివాస్ యాదవ్, సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్ తదితరులు తరలివెళ్లారు. – చిక్కడపల్లి

వీడీసీసీ రోడ్డు పనులు ప్రారంభం

కార్వాన్ నియోజకవర్గం, లంగర్‌హౌస్ డివిజన్, ఇబ్రహీంబాగ్‌లో మంగళవారం వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్, తదితరులు.
– మెహిదీపట్నం ఫిబ్రవరి 6

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

మెహిదీపట్నం ఫిబ్రవరి 6 : నాంపల్లి నియోజకవర్గంలో శాంతి భద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఆయన దక్షిణ, పశ్చిమ మండలం ఇన్‌చార్జి డీసీపీ సాయి చైతన్యతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యాత్మక ప్రాంతాల శాంతి భద్రతల గురించి చర్చించారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి ఐదేండ్ల జైలు

నాంపల్లి కోర్టులు, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : ఛత్రినాక పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన హత్యాయత్నం కేసులో నిందితుడు మహ్మద్‌ఫిరోజ్‌కు ఐదేండ్ల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ 3వ అదనపు జిల్లా కోర్టు జడ్జి జె. కవిత మంగళవారం తీర్పు ప్రకటించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.రాంరెడ్డి కథనం ప్రకా రం.. మరో పెళ్లి చేసుకునేందుకు అడ్డుగా ఉందనే నెపంతో భార్యను హతమార్చాలనే ఉద్దేశంతో ఇంటికి పిలిచి కత్తితో తీవ్రంగా గాయపర్చగా.. పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు చార్జిషీట్ నమోదు చేసి కోర్టుకు సమర్పించారు. నేరం రుజువుకావడంతో నిందితుడికి కోర్టు శిక్షను ఖరారు చేసింది.

బీసీ గురుకులాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

కాచిగూడ, ఫిబ్రవరి 6: అన్ని రాష్ట్రాలలో కేంద్రం బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు దూరవవుతున్న బీసీ విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్‌ను కేంద్రప్రభుత్వం చెల్లించాలన్నారు.

కూల్చిన చోటనే ఇండ్లు నిర్మించాలి

ముషీరాబాద్, ఫిబ్రవరి 6 : వివేకానందనగర్‌లో అక్రమంగా ఇళ్లను కూల్చిన చోటనే తిరిగి పేదలకు గృహవసతి కల్పించాలని కోరుతూ దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ మంగళవారం ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

భారత జాతీయ నృత్యవేడుకలు ప్రారంభం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 6 : తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సౌజన్యంతో కళాకృతి నృత్యాలయ నిర్వాహణలో యాదాద్రి అఖిల భారత జాతీయ నృత్య వేడుకలు రవీంద్రభారతి ప్రధాన వేదికపై ఆరంభమయ్యాయి. ఈ సందర్భంగా ఢిల్లీకి చెందిన పింకీ మొండల్ ఆకాశ్ మల్లిక్‌లు, కపిల గీతి, మరకత మణి నర్తించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జార్ఖండ్‌కు చెందిన పరేశ్ బృందం పురులియ చావూ ప్రక్రియలో నరసింహావతారాన్ని ప్రదర్శించారు. ఉత్సవ నిర్వాహకురాలు ఎం. భారతి స్వాగతం పలకగా ద డ్యాన్స్ ఇండియా మాస పత్రిక చైర్మన్ విక్రం గౌడ్ సారథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ జీవన్‌లాల్, విశ్రాంత కమిషనర్ రవిశంకర్‌నారాయణ్, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, డాక్టర్ బిస్వాజిత్ లు పాల్గొనగా.. ప్రతిభ ప్రహ్లాద్, చిత్ర సుకుమార లకు యాదాద్రి జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు.

ఆకట్టుకున్న బుర్రకథ

ముషీరాబాద్, ఫిబ్రవరి 6 : చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో మంగళశారం విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాలం కృష్ణయ్య బృందం నిర్వహించిన బ్రహ్మంగారి కాలజ్ఞానం బుర్రకథ విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ గుండవరపు దేవీప్రసాద్, మాజీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త ముఖ్య అతిథులుగా పాల్గొని కళాకారులను సత్కరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పబ్బా వైకుంఠం, బండిరాజుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం ..

మెహిదీపట్నం, ఫిబ్రవరి 6 : నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం రేతిబౌలిలో ఉన్న రాయల్ జూనియర్‌కాలేజీ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. రేతిబౌలి సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఈ వార్షికోత్సవంలో కాలేజీ చైర్మన్ కె.జనార్దన్‌రెడ్డి, డైరెక్టర్ జీవీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ జె. విల్సన్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్తులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరించారు.

పుట్‌పాత్ ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు

అంబర్‌పేట, ఫిబ్రవరి 6 : జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ పరిధిలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు పుట్‌పాత్ వ్యాపారులను వేరే చోటకు తరలించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు డీసీ మారుతీ దివాకర్ ఆధ్వర్యంలో మంగళవారం సర్కిల్ కార్యాలయంలో టౌన్ వెండింగ్ కమిటీ(టీవీసీ) సమావేశం నిర్వహించారు. ఇందులో సర్కిల్ పరిధిలోని కాచిగూడ, అంబర్‌పేట, నల్లకుంట ట్రాఫిక్ పీఎస్‌ల అధికారులు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వీరస్వామి, యూసీడీ ప్రాజెక్ట్ అధికారి రజిత, ఏఎంఓహెచ్ జ్యోతిబాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే అంబర్‌పేట గాంధీబొమ్మ వద్ద ఉన్న కూరగాయల వ్యాపారులను గ్రౌండ్ ఎదురుగా ఉన్న స్థలంలోకి మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెప్పారు.

బాధితులకు డబుల్ బెడ్‌రూంలు కేటాయించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 6 : ఇండ్లు కోల్పోయిన స్వామి వివేకానంద్‌నగర్ బస్తీ వాసులకు అధికారులు వెంటనే డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని బీఆర్ఎస్ నాయకుడు, న్యాయవాది సాయి అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానంద్‌నగర్ బస్తీ వాసులకు అధికారులు ప్రత్యామ్నాయం చూపకుండా ఇండ్లు కల్చివేయడం సరికాదన్నారు. బాధితులకు న్యాయం చేయాలని చేపట్టిన నిరాహార దీక్షకు ఆయన మద్దతు తెలిపారు. వారం రోజుల నుంచి వారు దీక్ష చేస్తున్నా పట్టించుకోక పోవడం సరికాదన్నారు.

కర్పూర ఠాకూర్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించేలా కృషి

అంబర్‌పేట, ఫిబ్రవరి 6 : నాయీబ్రాహ్మణ ముద్దుబిడ్డ, బిహార్ మాజీ సీఎం, ఇటీవల భారతరత్న పొందిన కర్పూర ఠాకూర్ వర్ధంతిని ఈనెల 17న ప్రభుత్వ పరంగా నిర్వహించే అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎంపీ హనుమంతరావు తెలిపారు. కర్పూర ఠాకూర్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను మంగళవారం బాగ్‌అంబర్‌పేటలోని తన నివాసంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఠాకూర్ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్పూర్ ఠాకూర్ ఫౌండేషన్ విశాఖ అధ్యక్షుడు జంపాల రాజేశ్, ఐఅండ్ పీఆర్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ రంగసాయి భట్టు, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 6 : కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరే విధానాలకు నిరసనగా జాయింట్ ఫ్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 16న అఖిల భారత స్థాయి కార్మికుల సమ్మెతో పాటు గ్రామీణ భారత్ బంద్ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ గోషామహల్ నియోజకవర్గం కన్వీనర్ జంగయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం కోఠిలోని ఆర్ఎఫ్ పీటీసీ యూఫీహెచ్‌సీ ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ నర్సుబాయికి ఆయన ఆశ వర్కర్లతో కలిసి సమ్మె నోటీసును అందించారు.

ఘనంగా షబ్బీర్ అహ్మద్ జయంతి

అంబర్‌పేట, ఫిబ్రవరి 6 : తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ వ్యవస్తాపక అధ్యక్షుడు దివంగత షబ్బీర్ అహ్మద్ జయంతిని మంగళవారం యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఖైరతాబాద్ జోన్ డీఎం అండ్ హెచ్ఓ, మెడికల్ జేఏసీ కన్వీనర్ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ హాజరై షబ్బీర్ అహ్మద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్ డా.యాకేందర్‌రెడ్డి, యూనియన్ ప్రెసిడెంట్స్ ఎన్.రాబర్ట్ బ్రూస్, వి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జె.అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ అమ్తుల్ అజీమ్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎండీ ఫారూఖ్, హన్మంత్‌రావు తదితరులు పాల్గొన్నారు

వ్యాసరచన పోటీలు..

ముషీరాబాద్, ఫిబ్రవరి 6.. హైదరాబాద్ జిందాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం ముషీరాబాద్ వైఎస్ఆర్ పార్కు సమీకృత క్రీడా ప్రాంగణంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, పర్యావరణంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్లాస్టిక్ నివారణ, పర్యావరణంపై వ్యాసరచన, డ్రాయింగ్‌లు వేశారు. ఈ నెల 11న రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు సాంబశివరావు, బీజేపీ నేత సత్యనారాయణ తెలిపారు.

భర్త వేధింపులు.. వివాహిత బలవన్మరణం

గోల్నాక, ఫిబ్రవరి 6 : భర్తవేధింపుల కారణంగా మనస్తాపం చెందిన ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన అంబర్‌పేట పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన ప్రకారం.. గోల్నాక తిరుమల నగర్‌కు చెందిన కె.భవానీ (32) అభిలాష్ అనే వ్యక్తిని ఆరేండ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి పిల్లలు లేరు. కొంత కాలంగా భర్త అభిలాష్ మానసికంగా వేధించడంతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె సోమవారం రాత్రి ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, ఫిబ్రవరి 6: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ మల్లికార్జున్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(50)మంగళవారం బుద్వేల్-ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని ఒంటిపై నీలి రంగు గీతల చొక్క, బూడిద రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు.

చోరీకి గురైన ఫోన్లు అందజేత

చిక్కడపల్లి, ఫిబ్రవరి 6 : చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన వారి ఫోన్లను మంగళవారం సీఐ సీతయ్య బాధితులకు అందజేశారు. చోరీకి గురైన ఐదు ఫోన్లను ట్రేస్ చేసి పట్టుకొని అందించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేసులో క్రైం కానిస్టేబుల్ హరిప్రసాద్‌ను సీఐ అభినందించారు.

మహిళ ను వేధించిన యువకుడికి జైలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 6 : మహిళను వేధించిన వ్యక్తికి మూడు రోజుల శిక్ష పడింది. మంగళవారం సీఐ సీతయ్య వివరాలను వెల్లడించారు. అశోక్‌నగర్‌లోని ఓ మహిళను వేధించిన పి. నరేశ్‌కుమార్‌పై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుని కోర్టులో హాజరు పర్చారు. దీంతో ప్రత్యేక మేజిస్ట్రేట్ సత్యనారాయణ నిందితుడికి 3 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

భక్తిపారవశ్యంగా హరికథాగానం

కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మాజీ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి జన్మదినాన్ని పురస్కరించుకొని శంకరమఠంలో మంగళవారం కట్టా జేజే నారాయణ భాగవతార్‌చే నిర్వహించిన భక్త మార్కండేయ హరికథాగానం భక్తిపారవశ్యంగా సాగింది. ఈ కార్యక్రమంలో జీఎస్‌టీ అడిషనల్ కమిషనర్ దాసరి బాలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులను సత్కరించగా హర్షవర్ధన్, గుమ్మడి గోపాలకృష్ణ, సుబ్బారావు, మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.
– ముషీరాబాద్, ఫిబ్రవరి 6

సికింద్రాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శిగా మైఖేల్ ప్రసన్న

చిక్కడపల్లి, ఫిబ్రవరి 6 : గాంధీనగర్‌కు చెందిన బుసమల్ల మైఖేల్ ప్రసన్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. మంగళవారం సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ మైఖేల్ ప్రసన్నకు నియామక పత్రం అందజేశారు. మైఖేల్ ప్రసన్న మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తానని చెప్పారు.

వరప్రసాద్‌కు పురస్కారం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 6 : సాంస్కృతిక సంఘ సేవాసంస్థ వంశీ ఇంటర్నేషనల్ ఇండియా నెలకొల్పిన డాక్టర్ కె.వి. రమణాచారి జాతీయ జీవన సాఫల్య పురస్కారాన్ని 2024వ సంవత్సరానికిగాను సహప్రాపధాని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్‌కు ప్రకటించారు. ఈ నెల9వ తేదీన రవీంద్రభారతిలో జరిగే రమణాచారి 72వ జన్మదినం సందర్భంగా వరప్రసాద్‌కు సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అవార్డును అందజేస్తారని వంశీ సంస్థల అధినేత డా.వంశీరామరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతిస్వామి విచ్చేయనున్నట్లు ఆయన తెలిపారు.

'ఉస్మానియా'కు వైద్య పరికరాలు అందజేత

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 6 : ఉస్మానియా దవాఖానకు స్ట్రీట్ కాజ్ ఫ్రాన్సిస్ సంస్థ రూ.1.50లక్షల విలువ చేసే వైద్య పరికరాలను అందజేసింది. ఈ మేరకు మంగళవారం అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులతో రూపొందించిన స్ట్రీట్ కాజ్ ఫ్రాన్సిస్ సంస్థ ప్రతినిధులు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్‌కు, సీఎస్ అడ్మిన్ ఆర్ ఎంవో-1 డాక్టర్ శేషాద్రిలను కలిసి పది స్ట్రెచర్లు, పది వీల్‌చైర్లు, 6 నెబ్యులైజర్‌లను అందజేశారు. ఆర్ఎంఓ లు డాక్టర్ సాయి శోభ, డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పింఛన్లు అందజేయాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 6: పింఛన్లు సకాలంలో అందకపోవడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భోలక్‌పూర్ బీఆర్ఎస్ నాయకుడు కేఎం సాయికిరణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం భోలక్‌పూర్‌లో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు బీఆర్ఎస్‌కు ఓట్లు వేశారన్న అక్కసుతోనే తమకు ప్రభుత్వం పింఛన్లు వేయడంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేయాలని కోరారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా..

సుల్తాన్‌బజార్,ఫిబ్రవరి 6. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా 70 సంవత్సరాలకు పైగా టీఎన్జీవో కేంద్ర సంఘం నిరంతరం కృషి చేస్తుందని సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అన్నారు. ఇటీవల తెలంగాణ ఉపాధి శిక్షణ శాఖలో కాంట్రాక్ట్‌గా ఉన్న వారు రెగ్యులరైజ్ కావడంతో తెలంగాణ ఉపాధి శిక్షణ శాఖ సెంట్రల్ ఫోరంలో 200 మందికి సభ్యత్వాలను అందించారు. ఈ మేరకు మంగళవారం ఆయన సెంట్రల్ ఫోరంలో నూతనంగా సభ్యత్వం పొందిన ఎల్. సుధాకర్‌రెడ్డికి ఉపాధ్యక్షుడిగా, శ్రీనివాస్, చాంద్‌పాషాలకు సంయుక్త కార్యదర్శులు గా నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఫోరం పబ్లిసిటీ సెక్రటరీ కె. రవీందర్, జిల్లా కార్యదర్శి సయ్యద్ మహమ్మద్ ఘోరీ, సభ్యులు శ్రీదేవి, జ్యోతి, నాగరాజు, సుదర్శన్, ప్రవీణ్ రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

నా క్లయింట్ **ప్రతీక్ కేడియా, తండ్రి. ప్రమోద్ కుమార్ కేడియా**, వయస్సు: సుమారు 32 సంవత్సరాలు, వృత్తి: అడ్వకేట్, ఇంటి చిరునామా: 19-1-912/A/3 & 3/1 వారు తన లింక్ డాక్యుమెంట్స్ అనగా హైదరాబాద్, బహదూర్‌పురా, మురళీనగర్, 19-1-912/A/3 & 19-1-912/A/3/ కలిగిన తన ఇంటికి సంబంధించిన సేల్ డీడ్స్ పోగొట్టుకున్నారు. ఎవరికైనా దొరికితే దానిని దిగువ ఇవ్వబడిన చిరునామా వద్ద మాకు అందజేయగలరు. వారు తగువిధంగా బహూకరించబడతారు. మా క్లయింట్‌కు తెలియకుండా సదరు మిస్సింగ్ ఒరిజినల్ డాక్యుమెంట్ అనుసరించి ఏదేని లావాదేవీ జరిపినట్లయితే చెల్లనిదిగా భావించబడును.

సం/- ఆనంద్ వ్యాస్,
అడ్వకేట్
ఫ్లాట్ నం. 1065, M.No.
8-13-61/10/3, రాజేంద్రనగర్,
R.R. జ